క్లుప్తంగా

కుప్పకూలిన పంచాయతీ కార్యదర్శి



పులిమేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మీదేవి

పెద్దాపురం: విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఉద్యోగి కుప్పకూలిన సంఘటన సోమవారం పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గోరింట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటలక్ష్మీదేవి సోమవారం ఉదయం ఫోన్ కాల్ మాట్లాడుతుండగా, బీపీ అధికం కావడంతో కుప్పకూలారు. అక్కడున్న సచివాలయ, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఏఎన్‌ఎంలు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పులిమేరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. ఇటీవల అనారోగ్యంతో సెలవులో ఉన్న ఆమె, ఇటీవల విధుల్లో చేరారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయంలో బారులు తీరారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తెల్లవారుజామున పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలి అభిషేకం, తొలి పూజలు నిర్వహించారు. తొలి అభిషేకం పూజలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి ఆలయం, మూలవిరాట్, అమ్మవారి ఆలయంతో పాటు, ఉప ఆలయాలను పూలతో అలంకరించారు. ధ్వజస్తంభం మార్గం నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి పాలు, చెరకు రసం, నీళ్లతో అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వేత్త అమలకంటి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన పూలతో సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అళ్లకి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

కరప: ఆటో కోసం ఎదురు చూస్తున్న యువకుడిని మోటారు సైక్లిస్టు ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. వివరాలు.. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన దామలంక మణికంఠ, తన స్నేహితుడు కాతేటి అనిల్ కుమార్‌తో కలిసి ఆదివారం 8 గంటలకు ఆటోలో కరప వచ్చారు. అక్కడ తెలుగు ఉపాధ్యాయుడిని కలిశారు. సోమవారం జరిగే టెన్త్ తెలుగు పేపర్‌కు సంబంధించి ఆయనతో మాట్లాడారు. అనంతరం రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వెళ్లడానికి రోడ్డు పక్కన ఆటో కోసం నిలబడ్డారు. ఆ సమయంలో కరప నుంచి పెనుగుదురు వైపు వెళుతున్న మోటార్ సైక్లిస్ట్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ అతి వేగంగా వచ్చి అనిల్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో అనిల్ తల వెనుక భాగం, ముఖం, కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. మోటార్ సైకిల్ నడుతున్న వ్యక్తి కూడా గాయపడ్డాడు. వారిద్దరినీ స్థానికులు 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీటీపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా

కాకినాడ సిటీ: దళితుల కొబ్బరి పంటను వలస భూములకు అప్పజెప్పిన రౌతులపూడి డిప్యూటీ తహసీల్దార్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు గొడుగు సత్యనారాయణ, మానుకొండ లచ్చబాబు, కె.జనార్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం పారుపాక, కోడూరు, పి చామవరం, ఎస్ అగ్రహారం గ్రామాల పేద దళితులు సాగు చేసుకుంటున్నా, తప్పుడు ఆర్డర్‌తో డిప్యూటీ తహసీల్దార్, ఎస్సైలు దళితులను భయపెట్టి, వలస భూస్వామికి అప్పజెప్పారని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా దళితులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారని, రూ.పది లక్షల విలువైన కొబ్బరి పంటను భూస్వామి మెర్ల సత్యనారాయణ చౌదరికి అప్పగించారని వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ, దీనిపై ఆర్డీఓతో విచారణ జరిపించి, చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు



గొల్లప్రోలులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



సామర్లకోటలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పిఠాపురంలో విద్యార్థులను చెక్ చేసి పంపుతున్న సిబ్బంది

పదిష్టంగా పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు
- అధికారులకు సైతం సెల్‌ఫోన్ల నిషేధం



పిఠాపురంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



సామర్లకోటలో టెన్త్ పరీక్ష కేంద్రంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పిఠాపురం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది. ఉదయం 9.15 గంటలకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించగా తమరోల్ నంబర్లు ఎక్కడ వచ్చాయో చూసుకోడానికి విద్యార్థులు హడావిడి చేశారు. తొలిరోజు పరీక్ష కావడంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చారు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం పట్టణం, పిఠాపురం మండలం, గొల్లప్రోలు, గొల్లప్రోలు మండలం, కొత్తపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 3,533 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 3,451 మంది పరీక్షలకు హాజరు కాగా 76 మంది గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల్లోకి నో ఎంట్రీ

ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్న నేపథ్యంలో ఈసారి అటువంటి వాటికి అవకాశం లేకుండా పదో తరగతి పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే అధికారులకు సైతం పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్ వాడకంపై నిషేధం విధించారు. డ్యూటీ పడిన అధికారులను సైతం క్షుణ్ణంగా తనిఖీ చేసి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని లోపలికి అనుమతించారు. ఇతరులను పరీక్షా కేంద్రాల బయట మాత్రమే ఉంచారు. పిఠాపురం నియోజకవర్గంలోని పరీక్షా కేంద్రాల వద్ద ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సామర్లకోట, పెద్దాపురం పట్టణ, మండలాల్లో మొత్తం 3,286 మంది హాజరు కాగా, 135 మంది గైర్హాజరయ్యారు. సామర్లకోట మండలంలో మొత్తం 1,750 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 71 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య విలేకర్లకు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ హైస్కూల్‌లో 162 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 199కి 198 మంది హాజరుకాగా, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 205కి 195 మంది, ప్రతిభా విద్యా నికేతన్‌లో 256కి 242 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మండలంలో వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్-ఎలో 193కి 175 మంది, వేట్లపాలెం-బి సెంటర్‌లో 225కి 209 మంది, నవర జెడ్పీ హైస్కూల్‌లో 151కి 150 మంది, వీకే రాయపురంలో 165కి 160 మంది, ఉండూరులో 194కు 191 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 1,638 మంది రెగ్యులర్ విద్యార్థుల్లో 1614 మంది, 112 మంది ప్రైవేటు విద్యార్థులకు 65 మంది పరీక్షలు రాశారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ కేంద్రాన్ని ఎంఈఓ పరిశీలించారు.

విద్యార్థులకు ఇబ్బందులు

విద్యా శాఖాధికారులు సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఆయా పరీక్షా కేంద్రాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి క్లాసులు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో ఒంటి గంట వరకూ పేపర్లు ప్యాకింగ్ చేసే ప్రక్రియ కొనసాగడంతో విద్యార్థులు గేటు బయట సుమారు అరగంట సేపు వేచి ఉండాల్సి వచ్చింది. పరీక్షా కేంద్రంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు బస్సుల్లో మధ్యాహ్నం 12.30కే పాఠశాలకు వచ్చి, ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం క్లాసులను 1.30కు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

పకడ్బందీగా పరీక్షలు : ఎంఈఓ

పెద్దాపురం: అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని అన్ని పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఎంఈఓలు చౌదరి, శర్మ తెలిపారు. సోమవారం పదో తరగతి పరీక్షా కేంద్రాలను వారు పరిశీలించారు. విద్యార్థులకు వసతులు, పరీక్షల నిర్వహణ, క్రమశిక్షణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ అర్బన్, రూరల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా అసౌకర్యాలు లేవన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. మాస్ కాపీయింగ్ లేకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తొలిరోజు పరీక్షలను 1,671 మంది రాయాల్సి ఉండగా, 1,607 మంది హాజరయ్యారన్నారు. మొత్తం 64 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

సామాజిక శ్రేయస్సుకు భద్రతా ప్రమాణాలు కీలకం

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాధాకృష్ణ

సామర్లకోట: ప్రతిఒక్కరూ భద్రత ప్రమాణాలను పాటిస్తూ, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ అన్నారు. స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో నిర్వహించిన భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు, ఆయా పరిశ్రమల్లో విధులు నిర్వహించే సమయంలో నిబంధనలతో పాటు, భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. కొన్ని సమయాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారితో పాటు, ఎదుటి వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. వారం రోజుల పాటు ఫ్యాక్టరీలోని ఉద్యోగులు, కార్మికులు, వారి పిల్లలకు అనేక ఆటల పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ అనిల్‌కుమార్ బిజావత్, ఇతర అధికారులు టి.నీరజ్‌కుమార్, రాజేందర్‌సింగ్ మాన్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

సామర్లకోట: మండల పరధిలో 320 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నట్టు ఇటీవల జరిగిన సర్వేలో గుర్తించారని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులున్న తల్లిదండ్రులు భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మంచి సేవలందించడంతో పాటు, వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తారని చెప్పారు. ప్రతి సోమవారం భవిత కేంద్రంలో జరుగుతున్న ఫిజియోథెరపీని ఆయన పరిశీలించారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు భవిత కేంద్రంలో చేస్తున్న ఫిజియోథెరపీని గమనించి, ప్రతి రోజూ ఇంటి వద్ద కూడా దివ్యాంగ విద్యార్థులతో చేయించాలని సూచించారు. భవిత కేంద్రానికి హాజరవుతున్న విద్యార్థుల శాతాన్ని పరిశీలించారు. ఇటీవల భవిత కేంద్రంలోని విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు ఎలా ఉపయోగిస్తున్నారో ఆరాతీశారు. భవిత కేంద్రానికి వస్తున్న విద్యార్థుల్లో మార్పులు రావడాన్ని గమనించి, సిబ్బందిని అభినందించారు. మానసికంగా మెరుగుపడిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తారని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ-2 పి.పుల్లయ్య, ఫిజియోథెరపిస్ట్ బి.నాగ అపర్ణ, భవిత టీచర్లు పద్మావతి, అనిత ఉన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ ఉషారాణి



గోరింటలో ఫ్లెక్సీలను తొలగింపజేస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ

పెద్దాపురం: ఎన్నికల నియమావళిలో భాగంగా కోడ్ ఉల్లంఘన జరిపితే చర్యలు తప్పవని మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసీసీ) కన్వీనర్, పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జూమ్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కోడ్ అమల్లోకి వచ్చి 48 గంటలకు గడుస్తున్నా మండలంలోని గోరింట గ్రామంలో టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు తొలగించలేదని గమనించిన ఎంపీడీఓ ఉషారాణి, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి వాటిని తొలగించారు. అనంతరం ఎంపీడీఓ ఉషారాణి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఈసీ ఆదేశాల కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఎన్నికల సంఘం సూచనల మేరకు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. విగ్రహాలకు ముసుగులు వేసి, ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీ కానీ, పోస్టర్లు కానీ ఉండరాదన్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది కోడ్ అమలుపై దృష్టి సారించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం జూమ్ మీట్‌లో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈఓపీఆర్డీ కె.రాజశేఖర్, ఏపీఓ రాజుబాబు, గోరింట వీఆర్ఓ బాబురావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫ్లెక్సీల తొలగింపు

సామర్లకోట: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీల తొలగింపు చేపట్టిన విషయం విదితమే. మండల పరిధిలో సోమవారం ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం ప్రారంభమైంది. ఫ్లెక్సీలతో పాటు, పోస్టర్లనూ తొలగించాల్సి ఉండగా, అనేక ప్రదేశాల్లో తొలగించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు మాట్లాడుతూ పూర్తిగా బ్యానర్లు, ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను తొలగించాలని సచివాలయ అడ్మిన్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అయితే రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లుంటే, ఆయా సచివాలయ పరిధిలోని సిబ్బందిపై చర్యలుంటాయని కమిషనర్ హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు



కోనపాపపేటకు చేరిన కేంద్ర పోలీసు బలగాలు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ పిఠాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేంద్ర సీఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు కోనపాపపేట, దాని పరిసర గ్రామాల్లో కవాతు నిర్వహించారు. గ్రామాల కూడళ్లలో లౌడ్‌స్పీకర్ల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు పోలీసులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి.. సస్యరక్షణ

- మామిడి, జీడిమామిడి పంటలకు ఆశిస్తున్న తెగుళ్లు
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న వ్యవసాయ నిపుణులు
- కాయ దశలో అప్రమత్తంగా ఉండాలని సూచన
- నియోజకవర్గంలో 1,833 ఎకరాల్లో మామిడి సాగు



మామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన అధికారి

పిఠాపురం: ఈ ఏడాది మామిడి, జీడి మామిడి సాగు ఆశాజనకంగా ఉంది. తొలుత పూతదశలో రైతులను కలవర పెట్టినా ప్రస్తుతం పిందెలు దిగడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా మామిడి, జీడిమామిడి చెట్లు పూత, పిందెలతో కళకళలాడుతున్నాయి. ఉదయం పూట కురుస్తున్న తేనే మంచు దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు. ఇటీవల పొగమంచు, ఉష్ణోగ్రతలు పెరగడంతో పూత మాడిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో మామిడి, జీడి మామిడి పంటలను తెగుళ్లు ఆశించే అవకాశం ఉండడంతో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇదీ తీరు

పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 1,833 ఎకరాల్లో మామిడి తోటలను రైతు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కాపు ఆశాజనకంగా ఉన్నా మంచు ప్రభావం రైతులను కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఉద్యానశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మామిడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో తోటబడులు నిర్వహిస్తున్నారు. పంట రక్షణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్నారు. ప్రస్తుతం మామిడి పంటను తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాని పిఠాపురం ఉద్యానశాఖాధికారి కేస్ శైలజ సూచించారు.

తామర పురుగు నివారణకు..

మామిడి తోటల్లో కలుపు మొక్కలను పూర్తిగా తొలగించడం ద్వారా తామర పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. తోటల్లో నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. మోటారైజియం 4 కిలోలు ఒక క్వింటా పశువుల ఎరువుతో కలిపి ఒక్కో చెట్టు మొదల్లో 4 కిలోల చొప్పున వేసుకోవాలి. గానుగ సబ్బు ద్రావణం 2.5 మిల్లీ లీటర్లు, లేదా స్పైనోసాడ్ 0.25 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఆకు గూడు ప్రభావితమైతే..

గూడు పురుగు వలన ప్రభావితం అయిన ఆకులను ఎప్పటికప్పుడు తీసి వేయాలి వాటిని వెంటనే ఒక చోట మంట పెట్టి కాల్చివేయాలి. ప్రొఫినోపాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి లేదా క్లోరోఫైరీపాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి, క్వయినాల్‌పాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి వీటికి వేప నూనె 1500 పీపీఎం 3 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తేనె మంచు ఉధృతి ఎక్కువే..

మామిడి తోటల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూసుకోవాలి. వేపనూనె, పీపీఎం 3 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మోనో క్రోటోపాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి, క్లోరోఫైరీపాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి చెట్టు కాండం, పెద్ద కొమ్మలు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి. తేనెమంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు తేనె వంటి పదార్థం విసర్జించుట వలన ఆకులు, పూతపై క్యాప్నోడియం అనే బూజు శిలీంద్రం ఏర్పడుతుంది. దీని నివారణకు గంజి పిండి ద్రావణం పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగుకు..

ఈ పురుగు ఆశించిన కొమ్మలను పూర్తిగా తొలగించాలి. ఎకరానికి 160 వాట్స్ సామర్థ్యం గల 160 వాట్‌ల లైట్ ట్రాప్‌లను ఏర్పాటు చేసుకోవాలి. లెంబడసీహాలోత్రిన్ 0.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి

పండు ఈగ ప్రభావం ఎక్కువ

ఇది భయంకరమైన తెగులు. మామిడి పంటతో పాటు అన్ని పండ్ల జాతుల మీద ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా తీగజాతి కూరగాయలపై దీని ప్రభావం ఎక్కువ. లూరెస్, ట్రాప్స్, బైట్‌లను ఉపయోగించడం ద్వారా దీనిని నివారించవచ్చు. లూరెస్‌లు నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రంలో అందుబాటులో ఉంటాయి.

పక్షి కన్ను భాగాల తొలగింపు

పరిశుభ్రమైన సాగు వ్యాధి సోకిన మొక్కల భాగాలను తొలగించాలి. కార్బండైజిమ్ 1 గ్రాము ఒక లీటరు నీటికి, కార్బొండైజిమ్ డితానెమ్ 45లను లీటరు నీటికి 2.5 గ్రాములు , హెక్సాకోనాజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా 2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

> **సస్యరక్షణ చర్యలు కీలకం**
>
> 
>
> ప్రస్తుతం మామిడి పంట పిందె దశలో ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది సాధారణ సమయం కంటే కొంత ఆలస్యంగా పూత వచ్చింది. మంచు ప్రభావం ఎక్కువగా ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి. ఉద్యానశాఖ ద్వారా మామిడి, జీడి మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. మామిడి, జీడి మామిడి తోటల్లో ఎటువంటి మార్పులు గమనించినా రైతులు వెంటనే స్థానిక ఉద్యానవనశాఖ సిబ్బందిని సంప్రదించాలి. సస్యరక్షణ చర్యలు పాటిస్తే పిందె నిలబడి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి.
>
> – కేఎస్ శైలజ, ఉద్యానశాఖాధికారి, పిఠాపురం

'మా భూమిని రెవెన్యూ రికార్డుల్లో చేర్చాలి'

కలెక్టర్‌కు బాధితురాలి విజ్ఞాపన

కాకినాడ సిటీ: కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామంలోని తమ 1.70 ఎకరాల భూమిని సంబంధిత రెవెన్యూ అధికారి రికార్డుల్లో చేర్చడం లేదని, తమ భూమికి సంబంధించిన వివరాలను రెవెన్యూ రికార్డు(ఆన్‌లైన్)ల్లో చేర్చాలంటూ గొల్లపల్లి వెంకటరమణమ్మ సోమవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. తమ భూమిని ఎటువంటి సమాచారం లేకుండా రెవెన్యూ అధికారి రికార్డులను తారుమారు చేసి, ఏ విధమైన సంబంధం లేనటువంటి వ్యక్తికి దఖలు పరిచాడంటూ గతంలో కలెక్టర్ కృతికా శుక్లాకు స్పందనలో ఫిర్యాదు చేసినట్టు గొల్లపల్లి వెంకటరమణమ్మ తెలిపారు. అప్పట్లో కలెక్టర్ ఆదేశాల మేరకు భూమిని పరిశీలించిన అధికారులు.. ఆ భూమి తమదేనని నిర్ధారించారన్నారు. గత 34 ఏళ్లుగా ఈ భూమి తమ పేరుతోనే ఉందని, రెవెన్యూ అధికారులు చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు భూమిని పరిశీలించారని, ఆ సమయంలో భూమి వివరాలను, తమ స్వాధీనంలో ఉన్న అంశాలను రుజువు చేసుకున్నామన్నారు. స్థానికంగా సరిహద్దున ఉన్న రైతులు రాతపూర్వకంగా భూమి తమ స్వాధీనంలో ఉన్నట్టు ధ్రువీకరించారన్నారు. సర్వేలో రెవెన్యూ సిబ్బంది కూడా తమ భూమిని పరిశీలించిన అధికారులు, భూమిని వారు దఖలు పరిచిన వ్యక్తికి ఎటువంటి సంబంధం లేదని తేల్చినట్టు వెంకటరమణమ్మ తెలిపారు. అధికారులు పరిశీలించిన రికార్డుల ప్రకారం ఎటువంటి తాత్సారం చేయకుండా, తమ భూమిని రెవెన్యూ రికార్డుల్లో చేర్చాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ ఫిర్యాదుపై చర్యలు చేపట్టాలని కరప తహసీల్దార్‌ను ఆదేశించినట్టు ఫిర్యాదుదారు వెంకటరమణమ్మ కలెక్టరేట్‌లో విలేకర్లకు తెలిపారు.